www.siridaily.com
తెలుగు దినపత్రిక
# సిరి
...People Voice
శనివారం, డిసెంబర్ 14, 2024 | సంపుటి-1 సంచిక-2 పేజీలు - 4



## వీటితో పెట్టుకుంటే అగ్నివర్షమే

- ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ నుంచి యుద్ధ ట్యాంకులు
- రక్షణ రంగంలోకి చేరివేత
- నీటి మీద, భూ ఉపరితల మీద ప్రయాణం
- భౌగోళికంగా ఎత్తుపల్లాలున్నా ముందుకు
- మల్కాపూర్ చెరువులో ట్రయల్ రన్

2





## రూ.4వేల కోట్ల..

# ప్రభుత్వ భూమికి ఎసరు!?

- చట్టాల లొసుగుతో కబ్జాల పర్వం
- అధికార పార్టీ మంత్రి మంత్రాంగం?
- నకిలీ ఓఆర్సీ సర్టిఫికెట్లతో 356 ఎకరాల కబ్జాకు కుట్ర
- వివాదాస్పద భూమిలో రేకుల షెడ్లు
- బిల్డర్లు, పారిశ్రామికవేత్తలకు సైతం తప్పని బెదిరింపులు
- అవినీతి కూపంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం

కంచె చేను మేసిన చందంగా ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ప్రజాప్రతినిధి అక్రమార్జనే లక్ష్యంగా వేల కోట్ల రూపాయల విలువైన వివాదాస్పద ప్రభుత్వ భూములను కొల్లగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారు. సుమారు 4 వేల కోట్ల రూపాయల విలువ చేసే 356 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. నకిలీ ఓఆర్సీ సర్టిఫికెట్లు సృష్టించి మండల, జిల్లా స్థాయి రెవెన్యూ అధికారుల సంపూర్ణ సహకారాలతో నయా దందాకు తెర తీశారు. ఇక్కడ కూడా తన పేరు బయటకు రాకుండా ముఖ్య అనుచరులతో పని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కబ్జాకు సంబంధించి అడ్డుకునేందుకు వెళ్తున్న అధికారులపై అధికారం ప్రయోగిస్తూ వారి ముందరి కాళ్లకు బంధం వేస్తున్నారు. వివాదాస్పద భూములతో పాటు నియోజకవర్గ పరిధిలోని పారిశ్రామికవేత్తలు, బిల్డర్లను సైతం బెదిరిస్తూ భయ-భ్రాంతులకు గురి చేస్తున్నారంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు, వెంచర్లు చేసేందుకు పారిశ్రామికవేత్తలు, బిల్డర్లు వెనుకంజ వేస్తున్నారు. సదరు నేతను ప్రసన్నం చేసుకుంటేనే తప్ప పనులు సాఫీగా సాగాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ నేత వైఖరి మూలంగా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో ఇటు ప్రజలు.. అటు అధికార పార్టీ నాయకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- సిరిన్యూస్ - ప్రత్యేక ప్రతినిధి

వివరాలు 2లో





## సర్వేలో తప్పిదాలకు తావివ్వొద్దు

- అర్హులకు లబ్ధి చేకూర్చాలి
- శిథిలావస్థలోని ఇళ్లలో ఉంటున్న వారి వివరాలు సేకరించాలి
- దరఖాస్తుదారులకు ముందుగానే సమాచారాన్ని అందించాలి
- అధికారులకు కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశం

4



## కొత్త కానిస్టేబుల్స్ కి శిక్షణా తరగతులు

- వీఐపీ సెక్యూరిటీకి అన్నిర కాల విధులు తెలిసి ఉండాలి
- వజ్రా వాహనం సేవలను వినియోగించకోవాలి
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

3

## పట్టణ ప్రగతి జాడెక్కడ?

- పేరుకే గ్రేడ్ వన్ మున్సిపాలిటీ
- సంగారెడ్డిలో మురికి కూపంగా కుంటలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- అనారోగ్యాలకు గురవుతున్న ప్రజలు

3



## ఏడు సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణం

- టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జలమండలి అధికారులతో సమీక్ష

4





## లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం

- నేడు అన్ని కోర్టులలో నిర్వహణ
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద

**మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 13(సిరి న్యూస్)** జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అధికార సంస్థ ఆదేశాల మేరకు చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, పి.లక్ష్మి శారద శనివారం రోజు పెండింగ్ కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ మెదక్ జిల్లాలోని అన్ని కోర్టులలో నిర్వహించబడుతుందని, లోక్ అదాలత్ లో సివిల్, క్రిమినల్ కేసులు, భార్యభర్తల కేసులు, కుటుంబ తగాదాలు, మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, బ్యాంకు, ఫైనాన్స్ చిట్‌ఫండ్ కేసులు, ఇతర కేసులలో ప్రజలు, కక్షి దారులు తమ పెండింగ్ లో ఉన్న రాజీ చేసుకునే అవకాశం ఉన్న కేసులలో రాజీ కుదుర్చుకుని కేసులను సత్వరంగా రాజీ కుదుర్చుకోవాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ లో ఎక్కువ మొత్తంలో కేసులను రాజీ కుదుర్చుకోవాలని కోరారు.

## మెదక్ చర్చికి నిధుల మంజూరుపై కాంగ్రెస్ హర్షం

### చర్చి ప్రాంగణంలో సంబరాలు

**మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 13(సిరి న్యూస్)** మెదక్ పట్టణంలోని చర్చి వందేళ్ళ సంబరాలు జరుపుకోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.29 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి జూపల్లి కృష్ణారావుకు, నిధులు మంజూరికి కృషి చేసిన మెదక్ యువ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుకు, సహకరించిన జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ కు, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ కు మెదక్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మెదక్ జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజొద్దీన్ ముల్సాబ్ అన్నారు. రాబోయే నాలుగు సంవత్సరాలు ఎమ్మెల్యే రోహిత్ రావు ఆధ్వర్యంలో మెదక్‌ను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మేకల రవి, మంగ మోహన్ గౌడ్, అశోక్ రెడ్డి, కిషన్ గౌడ్, సలీం, ముజీబ్జ, హంగీర్, సూఫీ, నాగిరెడ్డి, సంజీవ్ తో పాటు పాల్గొన్నారు. కాగా నిధులు మంజూరు చేసినందుకు చర్చి ప్రాంగణంలో ఎమ్మెల్యే చిత్రపటానికి మెదక్ డయాసిస్ సభ్యులు క్షీరాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు.



### రూ.4 వేల కోట్ల..

# ప్రభుత్వ భూమికి ఎసరు!?


- చట్టాల లొసుగుతో కబ్జాల పర్వం
- అధికార పార్టీ మంత్రి మంత్రాంగం?
- నకిలీ ఓఆర్సీ సర్టిఫికెట్లతో 356 ఎకరాల కబ్జాకు కుట్ర
- వివాదాస్పద భూమిలో రేకుల షెడ్లు
- బిల్డర్లు, పారిశ్రామికవేత్తలకు సైతం తప్పని బెదిరింపులు
- అవినీతి కూపంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం

**సిరిన్యూస్-ప్రత్యేక ప్రతినిధి :**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో భూముల ధరలు కోట్ల రూపాయల్లో పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని వివాదాస్పద భూములను పరిష్కరిస్తానంటూ సదరు నేత తన అనుచరులతో ప్రయత్నాలు ప్రారంభించారు. అమీన్పూర్ మండలం బొమ్మన్ కుంట గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 30/2 సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్క్ వెనకాల 625 ఎకరాల ఇనాం భూములు ఉన్నాయి. గత 50 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు 256 ఎకరాలలో సాగు చేసుకుంటూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. వీరందరికీ ఓఆర్ సి పట్టాలు ఉన్నాయి. మిగిలిన 369 ఎకరాలు ప్రభుత్వ భూమిగా పేర్కొంది. ఈ క్రమంలో మిగులు భూమిగా ఉన్న 369 ఎకరాలను అక్రమంగా వివిధ కారణాలతో పట్టాలు చేసుకునేందుకు ఉన్నత పదవిలో ఉన్న ఆ నేత కబ్జా కుట్రకు తెర తీశారు. గత మూడు నెలలుగా ప్రభుత్వ భూమి చుట్టూ రేకుల షెడ్డు వేసి.. ప్రోక్లైనర్లు, జెసిబి లతో చదును చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు. స్థానిక రైతులు ప్రశ్నిస్తే.. తాము సదరు నేత అనుచరులమని, అనవసరంగా కలగచేసుకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా తమకు పట్టాలు జారీ చేయమని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తూ వేలకోట్ల రూపాయలు అర్జించేందుకు ప్రయత్నించడం పట్ల రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాగా నకిలీ ఓఆర్సీలు సృష్టించి అసలైన పట్టా భూములంటూ క్రయవిక్రయాలు ప్రారంభిస్తున్నారు. సుమారు 4000 కోట్ల రూపాయల విలువచేసే 369 ఎకరాలను కబ్జా చేసి ప్లాటుగా విభజించి అమాయకులకు అంటగట్టేందుకు ఇప్పటికే రంగం సిద్ధమైంది. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం నామం మాత్రం చర్యలు తీసుకుంటూ చేతులు దులుపుకుంటున్నారు.

### అధికార పార్టీలో అలజడి

అధికార పార్టీకి చెందిన రాష్ట్ర నేత భారీ ఎత్తున చేస్తున్న భూ కబ్జా పర్వం అటు ప్రభుత్వంలో, పార్టీలో భారీ ప్రకంపనలు సృష్టిస్తుంది. సదరు మంత్రి వ్యవహారంపై అధికార పార్టీ నేతలు, ప్రభుత్వ యంత్రాంగం అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అధికార పదవిలో ఉండడంతో ఎవరూ ఏమీ అనలేని దుస్థితి ఏర్పడింది. సదరు నేత వ్యవహారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి సైతం వెళ్ళినట్లు సమాచారం. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నవేల కోట్ల ప్రభుత్వ భూ కబ్జాపై సీఎం ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.



### ఓఆర్సీలు రద్దు చేసినా..

సుల్తాన్పూర్ ఇనాం భూములుగా చెబుతున్న భూముల్లో 1986, 1987లో అప్పటి ఆర్డీవో 500 ఎకరాలకు పైగా ఆక్యూపేషన్ రైట్ సర్టిఫికెట్లు(ఓఆర్సీ) ఇచ్చారు. అయితే ఆ రైతులు అప్పట్లో పలువురు రియల్ వ్యాపారులకు విక్రయించారు. అయితే ఈ భూముల వ్యవహారంపై అసెంబ్లీలో సైతం చర్చ జరగడంత హౌజ్ కమిటీని ఏర్పాటు చేశారు. 1993లో సీసీఎల్ఏ అధికారిగా ఉన్న మహంతి విచారణ చేసి అవి తప్పుడు ఓఆర్సీలుగా నిర్ధారించడంతో అప్పటి జాయింట్ కలెక్టర్ సర్టిఫికెట్లను రద్దు చేశారు. అయితే 83 ఎకరాల భూములకు చెందిన ఓఆర్సీ సర్టిఫికెట్లు మాత్రం కొనసాగాయి. ఇదే అవకాశం తీసుకున్న సదరు నేత చక్రం తిప్పడం ప్రారంభించారు. అనుకున్నదే తడవుగా బినామీని రంగంలోకి దింపి సుల్తాన్పూర్ భూములను ప్లాట్లుగా చేసి నోటరీపై రూ.10 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున భూ కబ్జా జరుగుతున్నా జిల్లా రెవెన్యూ అధికారులకు చీమకుట్టినట్లు కూడా కావడం లేదనేది నగ్నసత్యం. ఇలావుండగా బొమ్మను కుంట పరిధిలోని సర్వే నెంబర్ 30/2 లో గల మిగులు ప్రభుత్వ భూమి 369 ఎకరాలను మెడికల్ డివైస్ పార్కు కి కేటాయిస్తే నూతన పరిశ్రమలు ఏర్పాటు కావడంతో పాటు నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇటీవల పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కానీ ఆ ప్రతిపాదన బుట్టదాఖలైనట్లు సమాచారం.

## వీటితో పెట్టుకుంటే అగ్నివర్షమే!

**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 13(సిరిన్యూస్)**వీటితో పెట్టుకుంటే అగ్నివర్షమే...ప్రతి ఏటా భారత సైన్యానికి యుద్ధ ట్యాంకులను అందిస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఈ సంవత్సరం కూడా భారత రక్షణ రంగంలోకి యుద్ధ ట్యాంకులు చేరనున్నాయి. యుద్ధ ట్యాంకులు నీటి మీద, భూ ఉపరితల మీద ప్రయాణం చేయనున్నాయి. భౌగోళికంగా ఎత్తుపల్లాలున్నా ముందుకు సాగనున్నాయి. వీటితో పెట్టుకుంటే అగ్ని వర్షాన్ని కురిపిస్తాయి. భారత రక్షణ వ్యవస్థ బలోపేతంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కీలకంగా మారింది. శుక్రవారం నాడు ఆర్డినెన్స్ లో తయారైన యుద్ధ ట్యాంకులను స్థానికంగా ఉన్న మల్కాపూర్ చెరువులో ట్రయల్ రన్ నిర్వహించారు. నీటిలో కూడా ప్రయాణించే యుద్ధ ట్యాంకులను ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అధికారులు స్వయంగా దగ్గరుండి పరీక్షించారు. 14. 5 టన్నుల బరువు గల బిఎంపి యుద్ధ ట్యాంకులు ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. శాస్త్రవేత్తలు ఒక యుద్ధ ట్యాంకులో పదిమంది సైనికులు కూర్చొనే విధంగా వీటిని రూపొందించారు. నీటి పై గంటకు 7 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. శత్రువుల వెంట పడతాయి.యుద్ధ సమయాల్లో నీటి మీద ప్రయాణం చేస్తూ కూడా ఖచ్చితమైన లక్ష్యాల వైపు దూసుకు పోయే అవకాశం ఉంది. ఇక అవసరమైతే భూమీపై కూడా గంట 60 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేస్తూ భారత సైనికులకు పూర్తిస్థాయిలో సేవలు అందించనున్నాయి. మరొక కొన్ని రోజుల్లో భారత రక్షణ రంగంలో అడుగు పెట్టనున్నాయి. భౌగోళికంగా అత్యంత చాలా విచిత్రమైన



ప్రాంతాల్లో కూడా వీటిని సైనికులు ఉపయోగించుకునే విధంగా శాస్త్రవేత్తలు తయారు చేయడంతో డిఫెన్స్ ఫ్యాక్టరీ దేశ రక్షణ విషయంలో తోడ్పాటు నిస్తూ సైనికులకు అండగా నిలుస్తుంది. ఎద్దు మైలారంలో డిఫెన్స్ ఫ్యాక్టరీ నుండి ఇప్పటికీ ఎన్నో యుద్ధ ట్యాంకులను తయారు చేసి అందించిన ఘనత ఉంది గతంలో కూడా ఎన్నో యుద్ధ ట్యాంకులు అందించి ప్రశంసలను అందుకుంది.

# దత్తాత్రేయ స్వామి బ్రహ్మోత్సవాలు

## భక్త జన సంద్రంగా మారిన ఆలయ పరిసర ప్రాంతం

**హత్నూర, డిసెంబర్ 13 (సిరిన్యూస్)** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మాధుర గ్రామ శివారులో కొలువై దీరిన శ్రీ దత్తాత్రేయ స్వామి వార్షిక బ్రహ్మోత్స వాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.దత్తాత్రే యుని జయంతిని పురస్కరించుకుని ప్రతి యేటా జాతర ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయి తీగా వస్తోంది. డిసెంబర్ 7 శనివారం నుంచి ప్రారంభమై15వ తేది ఆదివారం వరకు అనగా 9రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. పంచశత చండీ పారాయణం, మహారుద్ర,దత్తాత్రేయ యజ్ఞం,సహస్ర ఘట జలాభిషేకం, దత్తాత్రేయ స్వామి కళ్యాణ మహోత్సవం తదితర వైదిక క్రతువులను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**650 ఏళ్ళ చరిత్ర...**

దత్తాచల పుణ్య క్షేత్రానికి సుమారు 650 యేళ్ళ చరిత్ర కలదని చరిత్రకారులు చెబుతున్నారు. దత్తల య్య గుట్టగా పేరొందిన ఆద్యాత్మిక నిలయం 1349 సంవత్సరంలో శ్రీ దత్తాచల భగవత్ క్షేత్రముగా గుర్తింపు పొందింది.నాటి నుండి క్షేత్రం దినదినాభి వృద్ధి చెందుతూ అశేష భక్త జనంతో విలసిల్లు తోంది. ప్రతి రోజు రాత్రి 2, 3 గంటల మధ్యలో క్షేత్రంలో ఓంకార శబ్దం వినబడుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.శ్రీ చక్రం,ఏకపాద ముద్రలు,దక్షిణావృత శంఖం,కూర్మం ముద్రలు,మూడు ముఖాలు ఛాయా రూపకంగా దర్శనమియ్యడం ఇక్కడ ప్రత్యేకత. అత్యం త రహస్యమైన తపో భూమిగా గుర్తించి శ్రీ నృసింహ సరస్వతి స్వామి పుష్కరకాలం 12 సంవత్స రాలు తప మాచరించారని ప్రతీతి. నామ దారకులు తపమాచరిం చి సిద్ధి పొందినట్లుగా చెబుతారు. బ్రహ్మో త్సవాల సందర్భంగా శ్రీ చక్రంతో కూడుకున్న క్షేత్రంలో చండీ హోమములు,చతుర్వేద పారాయణములు,గురు చరి త్ర పారాయణములు,శ్రీ దత్త మూల మంత్ర హవన ములు భక్తి ప్రపత్తులతో శాస్త్ర బద్ధంగా నిర్వహి స్తారు.

**నిత్యాన్నదానం**

దత్తాత్రేయుడి పుణ్యక్షేత్రం వద్ద నిరంతరం ఏడాది పొడుగునా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా. ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణలో ఆ దత్తాత్రేయుడు ఏదో ఒక రూపంలో బిక్షకు వస్తారని భక్తులు విశ్వసిస్తారు.

**చండీ యాగం**

చండీయాగాలు సామూహికంగా సుమారు 1000 వరకు నిర్వహిస్తారు భక్తులు ఒక హోమం లో పాల్గొని



1000 హోమాల ఫలితాన్ని పొందుతారు.చండీ చండీ యాగంతో గ్రహ పీడలు,బాలారిష్ట దోషములు, వ్యాధి భయాలు తదితర బాధల నుండి విముక్తి పొందుతారని భక్తులు నమ్ముతారు.యాగఫలంగా కళ్యాణ ప్రాప్తి,సం తాన వృద్ధి కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు.

**మహా పాదయాత్ర**

జిల్లా వ్యాప్తంగా అనేక మంది భక్తులు వివిధ గ్రామాల నుంచి పాదయాత్రగా బయలుదేరి దత్తాచల క్షేత్రం వరకు చేరుకుంటారు. భక్తజన సందోహంతో దత్త నామాన్ని జపిస్తూ ఎంతో భక్తి శ్రద్ధలతో ఆలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తారు. భగవన్నామ స్మరణతో సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు సిద్ధిస్తా యని భక్తుల విశ్వాసం.




## సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

**మెదక్ ప్రతినిధి, (సిరి న్యూస్) :** కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జిల్లాలోని వ్యా యామ ఉపాధ్యాయులకు అందరికీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల నుండి వ్యాయామ ఉపాధ్యా యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎం నగేష్ హాజరై జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణపై దిశాని ర్దేశం చేశారు. ఈనెల 17వ తేదీన ప్రారంభించే జిల్లా స్థాయి వాలీబాల్ మరియు కబడ్డీ పోటీల ను ఉద్దేశించి కమిటీలను ఏర్పాటు చేయాల న్నారు అంతే కాకుండా క్రీడాకారులకు మధ్యా హ్నం భోజన వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడాకారులందరూ ఈనెల 17 తేదీన ఉదయం 8:00 గంటలకల్లా హాజరయ్యే విధంగా చూడాలని అన్ని మండలాల ఎంపీడీ వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి నాగరాజు, పిడి లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎం వల్లే ఉద్యోగుల ధర్నా

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- దీక్షా శిబిరానికి మద్దతు

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 13(సిరిన్యూస్)** సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత చర్యల వల్ల సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు శిక్ష అనుభవి స్తున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ పక్కన సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల రిలే నిరహార దీక్షలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి అడ్డుగోలు హామీలతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి గద్దెనెక్కార న్నారు. 2023 సెప్టెంబర్ 13న వరంగల్ లో నిర్వ హించిన దీక్షా శిబిరానికి అప్పటి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి హాజరై మద్దతు తెలపడంతో పాటు, తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరి స్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా సమగ్ర శిక్ష అభియాన్ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని, గతంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, కంది మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ఎర్రోళ్ల చిన్న, శ్రవణ్ రెడ్డి, విఠల్, జీవ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

## ప్రభుత్వానికి విన్నవించిన ఎస్జీటీయూ నాయకులు

**వెల్దుర్తి, డిసెంబర్ 13 (సిరి న్యూస్ )** ఎన్నో ఏ ళ్లుగా వెట్టి చాకిరికి గురవుతూ.., విద్యావ్యవస్థను ప్రత్యే కంగా లేదా పరోక్షంగా ఎంతగానో ప్రభావితం చేస్తు న్నటువంటి సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో చేపడు తున్న నిరవధిక సమ్మె వల్ల విద్యావ్యవస్థ కాంప్లెక్స్ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పూర్తిగా కుంటుపడిందని ఎస్జీటీయు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంకినేని మధు సూదన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటే శం తెలిపారుసమగ్రశిక్షఉద్యోగుల నాయబద్ధమైన డి మాండులో భాగంగా ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి వారిని క్రమబద్ధీకరించాలన్నారు. అప్పటి వరకు తక్షణమే పేస్కేల్ ను అమలు చేయాలని లేదా వారికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉద్యోగ బెనిఫిట్స్ ఇవ్వాలని ఎస్‌జీటీయు రాష్ట్ర సంఘం పక్షాన ప్రభుత్వా నికి సంబంధించిన రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుకు విన్న వించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు ఆకుల ప్రభాకర్, ఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు దుండీగల్ యాదగిరి , రాష్ట్ర కోశాధికారి దుర్గం శ్రీనివాస్, రాష్ట్ర డీపీఓ వ్యవస్థాపక అధ్యక్షులు ముగిలిపలం శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా టీఎస్ఎ సయ◌ుఎస అధ్యక్షులు గుండా రాజీ రెడ్డి పాల్గొన్నారు.



## కొత్త కానిస్టేబుళ్లకు శిక్షణ తరగతులు

**-సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్**

**సంగారెడ్డి, డిసెంబర్ 13(సిరిన్యూస్)** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో ఎఆర్ హెడ్ క్వార్టర్స్ నందు కొత్తగా నియామకమైన ఎఆర్ సిబ్బందితో బాంబ్ డిస్పోజల్ టీంను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాంబ్ డిస్పోజల్ టీం నందు విధులు నిర్వహించే సిబ్బందికి అన్ని రకాల సెక్యూరిటీ విధుల గురించి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధుల గురించి తెలుసు కొని ఉండాలని అన్నారు. విఐపి ఎలాంటి కార్య కలాపాలను చేయాలన్నా ముందస్తుగా బాంబ్ డిస్పోజల్ టీం విఐపి వెళ్ళే మార్గాన్ని, ప్రసం గించ వలసిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే విఐపి కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని, అంతటి ప్రాధాన్యత కలిగిన విధులు నిర్వహించే బీడి టీం సిబ్బంది అన్ని రకాల భద్రతపరమైన విధులను గురించి తెలు సుకోవలసిన అవసరం ఎంతగానో ఉందని అన్నారు. విఐపి వద్దకు వెళ్ళే ప్రతి వ్యక్తిని ఏవిధంగా చెక్ చేయాలని, చెక్కింగ్ కు వినియో గించే పరికరాల గురించి క్లుప్తంగా వివరిం చడం జరుగతుంది అన్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్.ఐ లు రామరావ్, రాజశేఖర్ రెడ్డి, డానియోల్, ఆర్ఎస్ఐ మురళిదర్, ట్రైనర్ నారాయణ్ రావ్ బాంబ్ డిస్పోజల్ టీం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పట్టణ ప్రగతి జాడెక్కడ?

- పేరుకే సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపాలిటీ
- మురికి కూపంగా కుంటలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- అనారోగ్యాలకు గురవుతున్న ప్రజలు

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 13( సిరిన్యూస్)** సంగారెడ్డి మున్సిపల్ గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా ఏర్పడి నప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి కి నోచు కోలేదు. మున్సిపాలిటీ పరిధిలో 38 వార్డులు ఉన్నాయి. ఏ వార్డులో చూసినా గతుకుల రోడ్లు, చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. స్థానిక రాజీవ్‌పార్కుకు ఆనుకొని ఉన్న బొబ్బిలి కుంట, 6 వార్డు, కబ్జాలకు గురి అవుతుం డగా అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తు న్నారు. మురికి కాలువలు మట్టితో కూరికిపోయి చెత్తా చెదారంతో దర్శనమిస్తున్నాయి. శానిటేషన్ సిబ్బంది మురికి కాలువలు శుభ్రపరచడంలో విఫలమయ్యారని పలు వార్డుల సభ్యులు వాపోతున్నారు. చెత్త సేకరణ కూడా సరిగ్గా జరగడంలేదని, రెండు మూడు రోజులకు ఒకసారి చెత్తను సేకరించడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు మున్సిపల్ అధికా రులకు సమాచారం ఇచ్చినా కూడా స్పందన లేదని ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో వార్డులు దర్శనమిస్తున్నాయి. మరోవైపు బొబ్బిలి



కుంట కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు ఏమీ పట్టినట్టు వ్యవహరిస్తున్నారు. మురికి నీరంతా కుంటలోకి ప్రవహించి కుంట ఆనవాళ్ళు లేకుండా పోతుంది. దుర్గంధం వెదజల్లుతూ పందులు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పర్యటించి చూసిన దాఖలాలు లేవు. బొబ్బిలికుంటతో పాటు ఎర్రకుంటలోకి సైతం మురికి నీరు చేరి కలుషితమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోకపోతే సంగారెడ్డి లో ఉన్న వార్డు ప్రజలు మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.



# అర్హులందరికీ డబుల్ ఇళ్లు

## తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ ఎండీ గౌతమ్

**రామచంద్రపురం, డిసెంబర్ 13(సిరిన్యూస్) :** తెల్లాపూర్ పురపాలక పరిధిలో గల కొల్లూరు లో నూతనంగా నిర్మింపబడిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ మేనేజింగ్ డైరెక్ట ర్ గౌతమ్ శుక్రవారం సందర్శించారు. ఇండ్ల లబ్ధిదారులను కలిసి అక్కడి వసతుల గురించి తెలుసుకున్నా రు. అలాగే అలాట్మెంట్ వివరాల గురించి మున్సిపల్ కమీషనర్ సంగారెడ్డితో మాట్లాడారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మంజూరైనల బ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయగానే సౌకర్యాల విషయమై మున్సిపల్ కమీషనర్ కి ఇంటి నెంబర్లు, పారిశుద్ధ్యం, విద్యుత్ పై పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుండి లబ్ధిదారులకు ఇవ్వవలసిన అన్ని వసతులను మీకు అందివ్వడం జరుగుతుందని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ, ఆర్ఓ వెంకట రామయ్య, మేనేజర్ అఖిల్, నవోద్ రెడ్డి, అశోక్, పవన్, హౌసింగ్ బోర్డ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం

## సిద్ధిపేట కలెక్టర్ మను చౌదరి

**సిద్ధిపేట, డిసెంబర్ 13 (సిరిన్యూస్):** టీజీపీఎస్సీ గ్రూప్ 2 పరీక్ష నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి తెలిపారు. టిజిపీఎస్సీ నిబంధనల మేరకు ఈనెల 15 , 16 తేదీలలో జిల్లాలో గ్రూప్ 2 పరీక్ష నిర్వహణకు పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 13714 మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షకు హాజరుకానున్నారని ఇందుకు సిద్ధిపేట పట్టణంలో మొత్తం 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు 39 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, 37 మంది చీఫ్ సూపరింటిండెంట్లు, నలుగురు రూట్ అధికారులు, 12 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్లు, 576 మంది ఇన్విజిలేటర్లు,101 మంది బయో మెట్రిక్ ఇన్విజిలెటర్లను నియమించామన్నారు.



# సర్వేలో తప్పిదాలకు తావివ్వొద్దు

- అధికారులకు కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశం

**మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 13(సిరిన్యూస్)** ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పిదాలకు తావివ్వొద్దని, అర్హులకు లబ్ధి చేకూరేలా యాప్ లో వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. చిన్న శంకరంపేట మండల పరిధిలో మాందాపూర్ గ్రామంలో కొన సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్ వివరాల నమోదు ప్రక్రియను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 469 గ్రామపంచాయతీలలో నాలుగు మున్సిపాలిటీలలో గల 75 వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే అత్యంత పారదర్శకంగా కొనసాగుతుందని తెలిపారు. మొదటి విడతగా నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున మంజూరు చేయడం జరుగుతుందని, విడతల వారీగా ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని చెప్పారు. శిథిలావస్థకు చేరిన, పురాతన ఇళ్లలో నివాసముంటున్న వారు కొత్త ఇళ్లను నిర్మిం చుకునేందుకు వస్తే వారి వివరాలను సైతం యాప్లో పొందుపర్చాలని సూచించారు. ఒక్కో దరఖాస్తుదారుని వివరాలను



నమోదు చేసేందుకు ఎంత సమయం పడుతోంది. రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలను నమోదు చేస్తున్నారు, సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఎదురువుతున్నాయని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతమంది వివరాలు సేకరించారు. ఆన్లైన్లో ఎన్ని అప్లోడ్ చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియలో భాగంగా సర్వే వేగవంతం అయ్యేందుకు..సంబంధిత పత్రాలను దరఖాస్తుదారులు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో దామోదర్, పంచాయతి సెక్రటరీ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి, డిసెంబర్ 13 (సిరి న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు కొత్తగా డైట్ చార్జీలు పెంచిందని ప్రతి ఒక్కరు మంచి హారం అందించేందుకు కృషి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టర్ నుంచి వివిధ శాఖ అధికారులతో కాన్ఫరెన్స్లో మాట్లాడారు. జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్, కెజిబివి పాఠశాలల్లో ఈనెల 14వ తేదీన నూతన డైట్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు.16 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం



కాస్మోటిక్ చార్జీలను 200% పెంచిందని పేర్కొన్నారు. గురుకుల విద్యార్థుల కోసం పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందన్నారు. ఎలాంటి మెనూ ఇస్తున్నామో తల్లితండ్రులకు తెలియాలని, ఆ క్రమంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# హరీశ్ రావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**పటాన్ చెరు, డిసెంబర్ 13(సిరిన్యూస్) :**మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావును పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిశారు. ఐలాపూర్ లో బీఆర్ఎస్ యువనేత మాణిక్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమీన్ పూర్ లెవల్ కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ టోర్నమెంట్ ఆదివారంతో ముగుస్తుందని, అదే రోజు సాయంత్రం నిర్వహించే బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమానికి రావాలని హరీశ్ రావును బీఆర్ఎస్ నాయకులు ఆహ్వానించారు. హరీశ్ రావు ను కలిసిన వారిలో పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, నాయకులు ఆదర్శ్ రెడ్డి, అంజయ్య యాదవ్, శ్రీధర్ చారి ఉన్నారు.

# మల్లన్న హుండి ఆదాయం రూ. 81 లక్షలు

**చేర్యాల, డిసెంబర్ 13(సిరిన్యూస్)** కొమురవెల్లి మల్లి కార్జున స్వామి హుండీల లెక్కింపును శుక్రవారం ఆలయ వర్గాలు చేపట్టారు. ఈ హుండి లెక్కింపులో శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. మల్లన్న స్వామి 73 రోజుల ఆదాయముక్కుగాను 81 లక్షల 68 వేల 44 రూపాయలు నగదు,146 గ్రాముల మిశ్రమ బంగారం, 5 కిలోల 200 గ్రాముల వెండి, 5 క్వింటాళ్ల 50 కిలో గ్రాముల బియ్యం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఏ. బాలాజీ తెలిపారు. వెంకటేశ్వర స్వామి ఈవో పి. విశ్వనాథం, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఎస్సై రాజు గౌడ్, పాలక మండలి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

# ఏడు సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ల నిర్మాణం

- టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జలమండలి అధికారులతో సమీక్ష

**పటాన్ చెరు, డిసెంబర్ 13(సిరిన్యూస్) :**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్ చెరు నియోజకవర్గంలోని ఏడు చెరువుల పరిధిలో రూ.1100 కోట్ల అంచనా వ్యయంతో ఏడు సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్ చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జలమండలి ఎస్టీపీ విభాగం అధికారులు, తహసీల్దార్ లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎస్టీపీ ప్లాంట్ల ఏర్పాట్లపై సమగ్ర నివేదికను ఎమ్మెల్యేకు అందించారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో బీఓటి పద్ధతిలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని తిమ్మక్క చెరువు, మేళ్ల చెరువు, ఉసికే బావి, ఇక్రిసాట్, గండిగూడెం, బచ్చుగూడెం, అమీన్ పూర్ పరిధిలోని చెరువుల సమీపంలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.11 వందల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ప్లాంట్ల ఏర్పాటుకు భూ కేటాయింపులు జరపాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్, స్థానిక రెవెన్యూ అధికారులకు సంబంధిత శాఖ అధికారులు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్లాంట్ల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 25 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం, 40% సంబందిత కాంట్రాక్టర్ కు బీ ఓ టి పద్ధతిలో నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెరువులు, కాలువలను మురుగు నీరు, కాలు



ష్యం బారి నుండి సంరక్షించుకోవడంలో ప్లాంట్ల ఏర్పాటు కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి భూములు కేటాయించాలని తహసీల్దార్ లను ఆదేశించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, జలమండలి డీజీఎంలు బాబు, దీపాలి, శ్రీనివాసరావు, తహసీల్దార్ లు రంగారావు, రాధా, సంగ్రామ్, బిక్షపతి, గంగా భవాని పాల్గొన్నారు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.